TELTEL/2023/87917

జనంవెలుగు

అనునిత్యం అక్షరసత్యం

www.janamvelugu.com, janamvelugu2023@gmail.com

విలేఖర్లు కావలెను

జనం వెలుగు న్యూస్ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా అన్ని ప్రాంతాలనుండి జిల్లా మరియు మండల విలేఖరులు కావలెను

ఆసక్తి కలవారు వెంటనే సంప్రదించండి

9603322119

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | సంపుటి : 02 | సంచిక : 353 | గురువారం 13 - 03 - 2025 | ఎడిటర్ : సీతార్ల సురేష్ | పేజీలు : 8 | వెల : 6 /-

విజయవంతంగా ముగిసిన అంతర్ జిల్లాల యువ ఎక్స్ఛేంజ్ కార్యక్రమం

జనం వెలుగు, నిజామాబాద్, మార్చి 12:- కేంద్ర యువజన క్రీడా మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్ర, మేర యువ భారత్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహించే అంతర్ జిల్లాల యువ ఎక్స్ఛేంజ్ కార్యక్రమం నిజామాబాద్ జిల్లాలోని డిచ్పల్లిలో గల ఎస్బిఐ ట్రైనింగ్ సెంటర్లో విజయవంతంగా పూర్తయింది. హైదరాబాద్ జిల్లాకు చెందిన ఎంపిక చేయబడిన 30 మంది యువతీ యువకుల బృందము ఐదు రోజులపాటు నిజామాబాద్ జిల్లాలోని వివిధ ప్రాంతాలలోని చారిత్రాత్మక ప్రదేశాలు మరియు కర్మాగారాలు ఇతర దర్శనీయ స్థలాలను సందర్శించి అక్కడి పరిస్థితులను వివరాలను అధ్యయనం చేశారు. మార్చి 8వ తేదీన ప్రారంభమైన ఈ కార్యక్రమం మానసిక శారీరక శిక్షణ కార్యక్రమాలతో పాటు నిజామాబాద్ కామారెడ్డి జిల్లాలోని ప్రఖ్యాత దర్శనీయ స్థలాల సందర్శన, నిజామాబాద్ నగరంలోని పలు వ్యవసాయ క్షేత్రాల సందర్శన, చివరగా వ్యక్తిత్వ వికాస నిపుణులు, నాయకత్వ నేర్పు శిక్షణ కార్యక్రమాల నిర్వహణతో పూర్తయింది. కార్యక్రమం యొక్క చివరి రోజు కావడంతో పాల్గొన్న యువతీ యువకులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. శిక్షణ కార్యక్రమంలో జిల్లా యువజన అధికారిని శైలి బెల్లాల్, ఎస్బిఐ శిక్షణ సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్, వ్యక్తిత్వ వికాస నిపుణుడు మహేష్, ఇతర ప్రభుత్వ అధికారులు, నెహ్రూ యువ కేంద్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వెళ్లిపోయిన మహిళా ఆచూకీ కనుగొన్న పోలీసులు

జనంవెలుగు, చిలిప్ చేడ్:- భర్తతో విభేదాల కారణంగా ఇంటి నుంచి వెళ్లిపోయిన ఆమె ఆచూకీని పోలీసులు గుర్తించారు. చిలిప్ చేడ్:- మండలంలోని భద్రతాండకు చెందిన జరుపుల శిరీష కొంతకాలంగా కుటుంబకలహాలతో బాధపడుతూ ఇల్లు విడిచి వెళ్లిపోయింది. ఈ ఘటనపై ఆమె కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారణ ప్రారంభించారు. ఆధారాలు సేకరించిన పోలీసులు, ఆమె సంగారెడ్డిలోని ఒక ప్రైవేట్ స్కూల్‌లో ఉపాధి పొందుతూ జీవనం సాగిస్తున్నట్లు గుర్తించారు. అదనంగా, ఆమెకు ఎలాంటి ప్రమాదం లేదని నిర్ధారించుకున్న పోలీసులు, శిరీషను ఆమె తండ్రికి అప్పగించారు. తమ కుమార్తె ఆరోగ్యంగా తిరిగి రావడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

తెలంగాణ యూనివర్సిటీ పేరు మారిస్తే ఊరుకోము

జనం వెలుగు, నిజామాబాద్:- తెలంగాణ యూనివర్సిటీ పేరు మారిస్తే ఊరుకుమని ఎబివిపి రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు అమృత్ చారి హెచ్చరించాడు. తెలంగాణ యూనివర్సిటీ పేరు మార్పుపై వచ్చిన నివేదికను తిరస్కరిస్తూ రాష్ట్ర ప్రభుత్వ దిష్టి బొమ్మ తగలబెట్టి, ఉపకులపతి యాదగిరి రావుకు బుధవారం వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎబివిపి స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ అమృత్ చారి మాట్లాడాడు. ఎందరో విద్యార్థుల త్యాగల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం వచ్చిందని, అటువంటి తెలంగాణ కు ప్రతీకగా ఉన్న యూనివర్సిటీ తెలంగాణ యూనివర్సిటీ, అలాంటి పేరును తీసివేసి కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు గీత రెడ్డి అమ్మ పేరు ఈశ్వరి బాయి పేరు పెట్టాలని ప్రతి పాదించడం దురదృష్టకరమని ఆయన ఆందోళన వ్యక్తం చేశాడు. ఒక వేళ అభివృద్ధి చెయ్యాలి అను కుంటే యూనివర్సిటీలో అనేక మైన సమస్యలు ఉన్నాయని, వాటిపై దృష్టి పెట్టి యూనివర్సి టీని అభివృద్ధి చేస్తూ విద్యార్థులకు అండగా నిలవాలని ఆయన అన్నాడు. యూనివర్సిటి పేరు మార్పుపై రాష్ట్ర ప్రభుత్వం వెనకకు తగ్గకపోతే, ఎబివిపి ఆద్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని ఆయన హెచ్చరించాడు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మోహన్, నవీన్, అనిల్, లెనిన్, అజయ్, సంతోష్, వినోద్, సంతోష్, సాయి కుమార్ తదితర విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

ఈ నెల 31 లోపు ఎల్ఆర్ఎస్ లు చెల్లించండి. డిఎల్ పిఓ శివకృష్ణ

జనం వెలుగు, బాల్కొండ:- ఈ నెల 31 లోపు ఎల్ఆర్ఎస్ లు చెల్లించి నూతన గృహ నిర్మాణాలకు అనుమతులు పొందాలని డిఎల్ పిఓ శివకృష్ణ తెలిపాడు. మండల కేంద్రమైన బాల్కొండ పట్టణంలోని ఎంపిడిఓ కార్యాలయంలో బుధవారం విలేఖరులతో ఆయన మాట్లాడాడు. ఎల్ఆర్ఎస్ ను చెల్లించి తమ తమ ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన అన్నాడు. మార్చి 31 లోపు 25 శాతం చెల్లించి ఎల్ఆర్ఎస్ చేసుకోవాలని లేని ఎడల ఎల్ఆర్ఎస్ చెల్లించకుండా భవిష్యత్తులో నూతన కట్టడాలకు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపాడు. ఈ కార్యక్రమంలో బాల్కొండ ఎంపిడిఓ విజయ భాస్కర్ రెడ్డి, ఎంపిఓ గంగా మోహన్, కార్యదర్శి రజనీకాంత్ రెడ్డి, వివిధ గ్రామాల కార్యదర్శులు, జూనియర్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం సామాజిక న్యాయం సంక్షేమానికి కట్టుబడి ఉంది

తెలంగాణ భౌగోళిక ప్రాంతమే కాదు ఒక భావోద్వేగ ప్రాంతమని
స్థిరత్వం, దృఢసంకల్పానికి గుర్తు తెలంగాణ
260 లక్షల మెట్రిక్ టన్నుల వరి ఉత్పతి చేసి దేశంలోనే రికార్డు
రైతులే ఆత్మ, వారి అభివృదదే లక్ష్యం
గేమ్‌ఛేంజర్‌గా నిలిచిన మహాలక్ష్మి పథకం
ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించిన గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

జనం వెలుగు, హైదరాబాద్ మార్చి 12:- మా ప్రభుత్వం సామాజిక న్యాయం సంక్షేమానికి కట్టుబడి ఉందని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ తెలిపారు. అభివృద్ధి, ప్రగతివైపు తెలంగాణ అడుగులు వేస్తోందని ప్రశంసించారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ప్రసంగించారు. తెలంగాణ భౌగోళిక ప్రాంతమే కాదని, ఒక భావోద్వేగ ప్రాంతమని, స్థిరత్వం, దృఢసంకల్పానికి గుర్తు తెలంగాణ అని, 260 లక్షల మెట్రిక్ టన్నుల వరి ఉత్పతి చేసి దేశంలోనే తెలంగాణ రికార్డు సృష్టించిందని ప్రశంసించారు. తెలంగాణకు రైతులే ఆత్మ అని, వారి అభివృద్ధికి కృషి చేస్తున్నామని, ప్రజల కోసం నిరంతరం శ్రమించే వాళ్లే అన్నదాతలు అని జిష్ణుదేవ్ వర్మ కొనియాడారు. తెలంగాణ అభివృద్ధిలో రైతుల భాగస్వామ్యం ఉందని, రైతులకు మద్దతివ్వడం వారిని శక్తిమంతులుగా తీర్చిదిద్దడమే తమ బాధ్యత అని, దేశంలోనే అత్యధికంగా ధాన్యం పండిస్తున్న రాష్ట్రం తెలంగాణ అని తెలియజేశారు. రైతులకు రుణమాఫీ చేశామని, ఇదే రైతుల పట్ల తమ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. 25.35 లక్షల మంది రైతులకు ప్రయోజనం కల్పించామని, ఎకరానికి రూ. 12 వేల చొప్పున రైతులకు అందిస్తున్నామని, రైతు నేస్తం అమలు చేస్తున్నామని, వరకి రూ. 500 చొప్పున బోనస్ ఇస్తున్నామని, రైతుల కోసం వ్యవసాయ కమిషన్ ఏర్పాటు చేశామన్నారు. గేమ్‌ఛేంజర్‌గా మహాలక్ష్మి పథకం నిలిచిందని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణి కల్పిస్తున్నామని జిష్ణుదేవ్ వర్మ వివరించారు.

27 వరకు తెలంగాణ బడ్జెట్ సమావేశాలు

19న అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న ఆర్థిక మంత్రి
27 ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ

జనం వెలుగు, హైదరాబాద్ మార్చి 12:- బుధవారం బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 27 వరకు తెలంగాణ బడ్జెట్ సమావేశాలు జరుగనున్నాయి. తొలిరోజు ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రసంగించారు. అనంతరం శాసనసభ రేపటికి వాయిదాపడింది. ఆ తర్వాత అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధ్యక్షతన బీఏసీ సమావేశం జరిగింది. శాసనసభ భవనంలోని స్పీకర్ చాంబర్‌లో జరిగిన సమావేశంలో ప్రభుత్వం తరఫున డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, బీఆర్ఎస్ పార్టీ తరఫున మాజీ మంత్రులు హరీష్ రావు, ప్రశాంత్ రెడ్డి, బీజేపీ నుంచి మహేశ్వర్ రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, సీపీఐ నుంచి కూనమనేని సాంబశివరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ నెల 19న రాష్ట్ర బడ్జెట్‌ని ప్రవేశపెట్టేందుకు తీర్మానించారు. గురువారం (13న) గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరుగనున్నది. 14న హోలీ పండుగ సందర్భంగా అసెంబ్లీకి సెలవు ఉంటుంది. 15 గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ ఉంటుంది.. సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఉంటాయి. 16న ఆదివారం సెలవు ఉంటుంది. 17, 18 ప్రభుత్వ బిజినెస్ ఉంటుందని.. రిజర్వేషన్ల బిల్లులు ప్రవేశపెట్టే అవకాశం ఉంది. 19న అసెంబ్లీలో ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రవేశపెడుతారు. 20న సెలవు, 21న బడ్జెట్‌పై సాధారణ చర్చ ఉంటుంది. 22, 24, 25, 26 పద్దులపై, 27 ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ జరుగనున్నది.

అన్ని రంగాలలో మహిళలు రాణించాలి
జిల్లా జడ్జి సునీత కుంచాల

జనం వెలుగు, నిజామాబాద్, మార్చి 12: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా జడ్జి సునీత కుంచాల అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని, బేటీ బచావో - బేటీ పడావో కార్యక్రమం ప్రారంభించి పది సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా జడ్జి సునీత కుంచాల విచ్చేయగా, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పద్మావతి, అదనపు. కలెక్టర్ అంకిత్, అదనపు డీసీపీ బస్వారెడ్డి తదితరులు పాల్గొన్నారు .ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ, సమాజంలో సగభాగం అయిన మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగుతూ అద్భుతాలు సాధించాలని ఆకాంక్షించారు. మహిళలు ఏ విషయంలోనూ తక్కువ కాదని, అన్ని రంగాలలోనూ పురుషులతో సమానంగా పోటీపడాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా ప్రతి మహిళ విద్య, క్రీడలు, సాంస్కృతిక, సామాజిక రంగాల్లో అభివృద్ధిని సాధించాలని అభిలషించారు. మహిళలు తమ హక్కులను, బాధ్యతలను గుర్తెరిగి వాటిని కాపాడుకునేందుకు కృషి చేయాలన్నారు. అప్పుడే సమాజంలో సముచిత గౌరవం, గుర్తింపు లభిస్తుందన్నారు. మహిళల అభ్యున్నతి కోసం ప్రభుత్వాలు, వివిధ సంస్థల వారు అందిస్తున్న తోడ్పాటును పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని అభివృద్ధి దిశగా అడుగులు ముందుకు వేయాలని సూచించారు. మోసాలకు, అన్యాయాలకు గురైన సందర్భాలలో న్యాయం కోసం పోరాడాలని అన్నారు. జిల్లా స్థాయిలో వివిధ రంగాలలో ఉత్తమ సేవలందించిన మహిళలకు శాలువాలు కప్పి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి రసూల్ బీ, మహిళా కమిషన్ మెంబర్ సూదం లక్ష్మీ, డి.యం.హెచ్.ఓ రాజశ్రీ, జిల్లా బీసీ సంక్షేమ అధికారి స్రవంతి, డాక్టర్ ప్రతిమారాజ్, రిటైర్డ్ డీడబ్ల్యూవో సరళ, సి డి పి వో లు, సూపర్ వైజర్ లు , అంగన్వాడీ టీచర్లు గ్రామీణాభివృద్ధి శాఖా ఏ పి యం లు, సి సి లు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

బీసీలను కాంగ్రెస్ కులగణన పేరుతో వంచించి.. అవమానించింది

బీఆర్ఎస్ నేత కేటీఆర్

జనం వెలుగు, హైదరాబాద్ మార్చి 12:- బీసీలను కులగణన పేరుతో వంచించి. అవమానించిందని బీఆర్ఎస్ నేత కేటీఆర్ అన్నారు. తెలంగాణ అసెంబ్లీ మీడియా పాయింట్‌లో విలేకరులతో మాట్లాడారు. 'కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను అవమానించిందని తాము అనడం లేదని ఓ కాంగ్రెస్ ఎమ్మెల్సీ అన్నారని. అందుకు ఆయనను సస్పెండ్ చేశారన్నారు. మీరు బీసీల సంఖ్య ఎలా తగ్గిస్తారు? కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సమగ్ర కుటుంబ సర్వేలో ఆనాడు 56శాతం ఉన్న బీసీలు. ఈనాడు 46శాతం ఎట్ల అవుతారని ప్రశ్నిస్తే ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. ఇవాళ మేం అనడం లేదు కదా? రాష్ట్రంలో ఒక్క బీసీ సంక్షేమ సంఘం మీ లెక్కలు సరైనవని అంటుందా? ఒక్క బీసీ బిడ్డ మీ లెక్కతో ఏకీభవిస్తున్నడా? మీ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలైనా ఏకీభవించే పరిస్థితి ఉందా?' అంటూ ప్రశ్నించారు.'ఇవాళ కుల గణన పేరుతో బీసీలను వంచించి.. మోసం చేసి.. బీసీ సంఖ్యను తగ్గించి.. ఏదో ఉద్ధరించినట్లు సోషల్ జస్టిస్ అని గవర్నర్ నోటివెంట అబద్ధాలు చెప్పించడం సిగ్గుచేటు. కాంగ్రెస్ తల్లిని తీసుకువచ్చి సెక్రటేరియట్‌లో పెట్టి.. రాహుల్ తండ్రి సెక్రటేరియట్ ముందు పెట్టి అదేదో గొప్ప పని చేసినట్లు.. తెలంగాణకు ఏదో ఉద్ధరించినట్లు. సిగ్గు లేకుండా మాట్లాడుతున్న ఈ ప్రభుత్వానికి మేం చెప్పేది ఒక్కటే.. కాంగ్రెస్ తల్లిని, రాహుల్ గాంధీ తండ్రి మంచిగా భద్రంగా ప్యాక్ చేసి గాంధీ భవన్‌కు మూడేళ్ల తర్వాత పంపిస్తాం. గవర్నర్ ప్రసంగం ఇవాళ పూర్తిస్థాయిలో ప్రజలను వంచించడమే కాకుండా.. మోసం చేయడమే కాకుండా.. గవర్నర్ ప్రతిష్టను సైతం తగ్గించింది' అంటూ కేటీఆర్ ధ్వజమెత్తారు.

7 గురు పేకాట రాయుళ్ళ అరెస్టు

జనం వెలుగు, ఆర్మూర్:- ఆర్మూర్ మండలంలోని మిర్దాపల్లి గ్రామ శివారులో బుధవారం ఖాళీ స్థలంలో పేకాట ఆడుతున్న 7 గురిని పట్టుకొని అరెస్టు చేసినట్లు ఆర్మూర్ ఎస్ఐ పి సత్యనారాయణ తెలిపాడు. వద్దనుండి 23,480/- రూపాయలు, 3 సెల్ ఫోనులు మరియు మూడు బైకులను స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేయడం జరిగినది. వారి వద్ద సుమారు 23480 రుపాయలను, 3 సెల్ ఫోన్ లను, 3 బైకులను స్వాధీనం కేసు నామోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపాడు.